


సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 915 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 559.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ అంజనేయస్వామికి మంగళవారం పంచామృతాలతో అభిషేకాలు చేసి, నాగవల్లీ దళార్చన నిర్వహించారు. అష్టోత్తర, సహస్రనామాలతో పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

చెత్త నుంచి సంపద సృష్టిస్తున్న రెండో రాష్ట్రం ఏపీ

సాక్షి, అమరావతి: చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. గుంటూరులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌ను మంత్రి మంగళవారం సందర్శించారు. చెత్తను ప్రాసెసింగ్ చేసి, విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రక్రియను అక్కడి అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా దేశ రాజధాని ఢిల్లీ తరువాత ఇలాంటి ప్లాంట్లు కేవలం ఏపీలోనే ఉన్నాయని వెల్లడించారు. విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లోని మూడు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీల నుంచి చెత్తను సేకరించి శుభ్రం చేయడంతోపాటు గంటకు 15 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. పర్యావరణ హితం కోసం ఇలాంటి ప్లాంట్లు మరిన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి రావాలన్నారు. కార్యక్రమంలో జిందాల్ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ ఎంవీ చారీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి సదరమ్ క్యాంప్‌కు అన్ని ఏర్పాట్లు చేయండి



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం జరగనున్న ప్రత్యేక సదరమ్ క్యాంప్‌కు అన్ని ఏర్పాట్లూ చేయాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ మజీదాబేగం ఆదేశించారు. జిల్లా వైద్యశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో సదరమ్ సర్టిఫికెట్లు పొందిన వారికి ప్రభుత్వం మరోసారి పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న , డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదే సరీ!

నాడు తప్పు... నేడు ఒప్పు.. | **జిల్లాలో మళ్లీ రీ-సర్వే మొదలు**



మందపాడులో సర్వే చేస్తున్న అధికారుల బృందం

- 14 మండలాల్లో 14 గ్రామాల్లో నేటి నుంచి ప్రారంభం
- గత ప్రభుత్వంలో మెజారిటీ గ్రామాల్లో సర్వే పనులు
- గతంలోనే 62 గ్రామాల్లో సర్వే పూర్తి
- ఇప్పుడేదో కొత్తగా చేస్తున్నట్లు హడావుడి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నాడు తప్పు జరిగిపోతోందంటూ తప్పుడు ప్రచారం చేసిన కూటమి నేడు ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత అదే పనిని మళ్లీ మొదలుపెట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రీ సర్వే పనులను పూర్తి చేయడానికి సర్కారు నిర్ణయం తీసుకుంది. మంగళవారం నుంచి జిల్లాలో రీ-సర్వే మొదలైంది. ప్రస్తుతం 14 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు ద్వారా 26,329 ఎకరాల భూమిని సర్వే చేయాలని నిర్ణయించారు. మంగళవారం మూడు గ్రామాల్లో ఈ సర్వే మొదలైంది. 16 గ్రామాల్లో గ్రామ కంఠాలూ రీ-సర్వే చేయనున్నారు. దీన్ని పూర్తి చేయడానికి మూడు నెలల కాల వ్యవధిని నిర్దేశించారు. కొత్తగా మేడికొండూరు మండలం మందపాడు, ప్రత్తిపాడు మండలం మల్లాయపాలెం, తాడికొండ మండలం లచ్చన్నగుడిపాడు, తుళ్లూరు మండలం వడ్డమాను, ఫిరంగిపురం మండలం మెరికపూడి, పెదకాకాని మండలం అనుమర్లపూడి, గుంటూరు పశ్చిమ అనుమర్లపూడి, గుంటూరు తూర్పు జొన్నలగడ్డ, చేబ్రోలు మండలం మంచాల, పొన్నూరు మండలం వల్లభరావుపాలెం, తెనాలి మండలం పెదరావూరు, కాకుమాను మండలం పాండ్రపాడు, కొల్లిపర మండలం కుంచవరం, దుగ్గిరాల మండలం పెరికలపూడి గ్రామాల్లో ఈ రీ-సర్వే మొదలు పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 62 గ్రామాలలో 1,42,450 ఎకరాల భూమిని రీ-సర్వే చేశారు. ఎనిమిది గ్రామాల్లో గ్రామకంఠం భూముల రీ-సర్వే కూడా పూర్తి చేశారు. గతంలో జరిగిన సర్వేను అలానే ఉంచి వాటిల్లో ఏమైనా ఫిర్యాదులు వస్తే వాటిని సరి చేసే యత్నం చేస్తారు.

గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా..

ఎప్పుడో 1905లో బ్రిటిషర్లు భూ సర్వే చేశారు. ఆ తర్వాత 2020 వరకు మరే నాయకుడు దీని జోలికి వెళ్లే ధైర్యం చేయలేదు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ రీ-సర్వేని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. దీని ద్వారా ప్రతి అంగుళం భూమి మ్యాపింగ్‌లోకి తీసుకురావడంతోపాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చే దిశగా కృషి చేశారు. సర్వే ప్రక్రియ గుంటూరు జిల్లాలో 2020 డిసెంబర్‌లో ప్రారంభమైంది. తొలుత పైలెట్ ప్రాజెక్ట్‌గా దుగ్గిరాల మండలంలోని దేవరాపల్లి అగ్రహారం, ప్రత్తిపాడు మండలంలోని కొండజాగర్లమూడి, వేమూరు మండలంలోని పులిచింతలపాలెం, యడ్లపాడు మండలంలోని మర్రిపాలెం, దాచేపల్లి మండలంలోని అలుగుమల్లిపాడులను ఎంపిక చేసి విజయవంతంగా పూర్తి చేశారు. సర్వే అనంతరం సంబంధిత భూమి, స్థలం యజమానికి ప్రింటెడ్ పాస్‌బుక్ ఉచితంగా ఇచ్చారు.

గతంలో పచ్చ పార్టీ, మీడియా దుష్ప్రచారం

గుంటూరు జిల్లాలో మొత్తం 223 గ్రామాలు ఉండగా గుంటూరు డివిజన్‌లో 119, తెనాలి డివిజన్‌లో 104 గ్రామాలు ఉన్నాయి. గతంలో 47 గ్రామాల్లో సర్వే ఆఫ్ ఇండియాకు, 121 గ్రామాల్లో యుక్రా అనే సంస్థకు సర్వే బాధ్యతలు అప్పగించారు. సర్వే ఆఫ్ ఇండియాకు అప్పగించిన 47 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేసింది. యుక్రా సంస్థ 46 గ్రామాల్లో డ్రోన్‌ను తిప్పింది. మొత్తం 93 గ్రామాల్లో డ్రోన్‌ను తిప్పి ఏరియల్ వ్యూ మ్యాపింగ్ పూర్తి చేశారు. 23 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ(ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్)అను జారీ చేశారు. వీటిని క్షేత్రస్థాయిలో భూమితో పోల్చి నిజనిర్ధారణ(గ్రౌండ్ ట్రూతింగ్) చేసే ప్రక్రియ 22 గ్రామాల్లో పూర్తి అయ్యింది. అయితే రికార్డులలో ఉన్న భూమికి క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి పొంతన లేకపోవడం వల్ల సర్వే పూర్తి చేయడంలో కొంతమేర ఇబ్బందులు వచ్చాయి. భూ యజమానులు అందుబాటులో లేకపోవడం సర్వేలో ఆలస్యం అయ్యింది. ఇప్పుడు కూడా భూ యజమానుల సమక్షంలోనే సర్వే చేయాలని నిర్ణయించారు. చాలా చోట్ల పొలాలు కొన్న యజమానులు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి ఉండగా, మరికొన్ని చోట్ల విదేశాలలో ఉండటంతో వారిని రప్పించడం తలకు మించిన భారమైంది. అయితే దీనిపై తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియా అప్పట్లో పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశాయి.



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: యువతరం మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోరాదని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో మంగళవారం మత్తు పదార్థాలు, ర్యాగింగ్, ట్రాఫిక్ నియంత్రణపై వారధి పేరుతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో గురువుల పట్ల గౌరవం, తోటి విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా ఉంటూ క్రమశిక్షణతో మెలిగిన వారే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని చెప్పారు. వ్యసనాలు, చెడు స్నేహాలకు బానిసలుగా మారితే ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. ర్యాగింగ్ నేరమని, కేసు నమోదైతే భవిష్యత్తుల్లో ఎక్కడా చదువుకునేందుకే కాకుండా ఉద్యోగం చేసే పరిస్థితులూ ఉండవని చెప్పారు. ఈవ్‌టీజింగ్, మత్తుపదార్థాల వినియోగం తదితర నేరాలకు నమోదు చేసే కేసులు, పడే శిక్షలు, ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ తమ కళాశాలలో ర్యాగింగ్‌కు తావులేదని వివరించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లను ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, డీఎస్పీ కె.అరవింద్, కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ ఆవిష్కరించారు. సదస్సులో ర్యాగింగ్, వేధింపుల వ్యతిరేక కమిటీల ఉపాధ్యక్షులు ఆర్. శ్రీనివాసరావు, అనితాకుమారి, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ వైస్ చైర్మన్ పి.నాగసుశీల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాగా పనిచేస్తే మహిళా పోలీసులకు అవార్డులు

తెనాలి రూరల్: పోలీసులను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. తెనాలి చెంచుపేటలోని చావాస్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులతో ఎస్పీ సతీష్ కుమార్ మంగళవారం సమావేశమయ్యారు. వారి జాబ్ చార్ట్ గురించి వివరించారు. ఉద్యోగ బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, దిశ డీఎస్పీ సుబ్బారావుతో కలిసి సమావేశంలో పాల్గొన్న ఎస్పీ సుమారు గంటన్నరపాటు మహిళా పోలీసులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహిళా పోలీసుల సేవలను కూడా శాంతిభద్రతల పరిరక్షణకు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. బాగా పనిచేసిన మహిళా పోలీసులకు సబ్ డివిజన్ల వారీగా అవార్డులు ఇస్తామని ఎస్పీ ప్రకటించారు. సమావేశంలో డీఎస్పీలతో పాటు సీఐలు మల్లికార్జునరావు, రాములు నాయక్, ఎస్ రమేష్ బాబు, బి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మి, ఎస్ఐలు పాల్గొన్నారు.

హాహాకారం

ధరలు ఢమాల్.. రైతులు దిగాలు



- భారీ వర్షాలు, నల్లతామర తెగులు ఎఫెక్ట్
- పెట్టుబడి ఖర్చులూ రావడంలేదంటూ గగ్గోలు
- గుజరాత్, ఎంపీ, యూపీతోపాటు బంగ్లాదేశ్, బర్మా దేశాల్లోనూ ఎక్కువ సాగు ధరలు పతనానికి కారణం
- కనీసం క్వింటా రూ.20 వేలు పలికితేనే గిట్టుబాటు అంటున్న రైతులు
- మిర్చిని ఆరబెట్టుకుని తీసుకురావాలంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/కొరిటిపాడు : మిర్చి రైతులను నష్టాల ఘాటు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరలు నేలచూపులు చూస్తున్నాయి. పైగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నల్లతామర తెగులు సోకి దిగుబడులు పడిపోవడంతో ధరలు ఊహించని విధంగా పతనమవడం రైతులపాలిట శాపంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీల్లో కలిపి పల్నాడు జిల్లాలో 1,07,485 ఎకరాల్లో, గుంటూరు జిల్లాలో 25,485 1,32,970 ఎకరాల్లో రైతులు మిర్చి పంట సాగుచేశారు. చీడపీడలు, తెగుళ్లు సోకి ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి మందులు పిచికారీ చేస్తున్నా తెగుళ్లు నాశనం కావడంలేదు. తాజాగా.. పూతలో తామరపురుగు కనిపించడంతో దిక్కుతోచని స్థితిలో రైతులున్నారు. దీని నివారణకు ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు. ఆచార్య రంగా యూనివర్సిటీ వారు రైతులకు సూచనలు ఇస్తున్నా ఇవేమీ అంతగా ఫలితం ఇవ్వడంలేదని రైతులు చెబుతున్నారు. దీంతో ఈ ప్రభావం దిగుబడిపై తీవ్రంగా పడుతోంది.

మిర్చిని ఆరబెట్టుకుని తీసుకురండి..

ప్రస్తుతం మిర్చి యార్డుకు అత్యధికంగా కోల్డ్‌స్టోరేజీల నుంచి వస్తోందని.. ఏసీ కాయలు కావడంతో ఆరుదల లేకపోవడం, రంగు మారడంతో మెరుగైన ధరలు లభించడంలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్త పంట కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోని, ప్రకాశం జిల్లా మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల నుంచి కొంతమేర వస్తోందని.. మిర్చిని ఆరబెట్టుకుని నాణ్యతతో కూడిన సరుకు యార్డుకు తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు.


క్వింటాకు రూ.20 వేలు వస్తే గిట్టుబాటు



నాది కర్నూలు జిల్లా, నందవరం మండలం, చిన్నకొత్తిలి గ్రామం. ఎకరా పొలంలో డీలక్స్ రకం మిర్చి పంట సాగు చేశా. ఇప్పటివరకు ఎకరాకు రూ.లక్ష అయ్యింది. మొదటి కోతగా మూడు క్వింటాళ్లు ఎరుపు కాయలు, మరో క్వింటా తాలు వచ్చింది. మొత్తం గుంటూరు యార్డుకు తీసుకొస్తే రూ.38 వేలే వచ్చాయి. మరో మూడు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొత్తం మీద రూ.50 వేలు నష్టం రావొచ్చు. క్వింటా మిర్చికి రూ.20 వేలు లభిస్తేనే గిట్టుబాటవుతుంది.

– పులిచింత నరసప్ప, రైతు, చిన్నకొత్తిలి గ్రామం, నందవరం మండలం, కర్నూలు జిల్లా.

ఫిబ్రవరి నుంచి మార్కెట్‌కు ఊపు



ప్రస్తుతం గుంటూరు మార్కెట్ యార్డులో ధరలు నిలకడగా ఉన్నాయి. తేజ, బాడిగ రకాలకు రూ.16 వేలు, 334, 341, నెంబర్-5 రకాలకు రూ.13 వేలు లభిస్తోంది. ప్రస్తుతం యార్డుకు అత్యధికంగా కోల్డ్‌స్టోరేజీల నుంచి వస్తోంది. ఏసీ సరుకు కావడంతో ఆరుదల లేకపోవడం , రంగు మారడంతో సరైన ధరలు రావడం లేదు. ఫిబ్రవరి నుంచి మార్కెట్ ఊపందుకుంటుందని ఆశిస్తున్నాం.

– వినుకొండ ఆంజనేయులు, మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి

గత ఏడాది రికార్డు స్థాయి !

ఓవైపు ఆశించిన దిగుబడి లేక, మరోవైపు మార్కెట్‌లో ధరలేక రైతులు నష్టాలతో కుదేలవుతున్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో క్వింటా మిర్చికి ధరలు పలకగా.. ప్రస్తుతం రూ.15 వేలు మించి పలకడంలేదు. గత ఏడాది తేజ, బాడిగ రకాలు క్వింటాలుకు రూ.21వేల నుంచి రూ.27వేల వరకు ధర లభించింది. దీంతో రైతులు ఉత్సాహంగా ఈ రకాలను సాగుచేశారు. ఎకరా మిరప సాగుకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. కానీ, పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. తెగుళ్లతో పంట ఎదుగుదల లేక దిగుబడి సగానికి పడిపోయింది. ఫలితంగా తేజ, బాడిగ, నంబర్-5, 334, 341 రకాలకు కోలుకోలేని దెబ్బ తగిలిందని, ఈ ధరతో కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. కనీసం రూ.20 వేలు పలికితేనే తమకు గిట్టుబాటు అవుతుందంటున్నారు. ఇదిలా ఉంటే.. మిర్చి పౌడర్ కంపెనీల వద్ద ఇప్పటికే రెండు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని మిర్చి వ్యాపారులు చెబుతున్నారు. దీనికితోడు గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌తో పాటు బంగ్లాదేశ్, బర్మా, వంటి దేశాల్లోనూ అత్యధికంగా పంట సాగుచేయడం కూడా ధరలు పతనానికి మరో కారణమని వ్యాపారులు చెబుతున్నారు. పైగా కోల్డ్‌స్టోరేజీల్లో అధికంగా నిల్వ ఉండటం కూడా మరో కారణమంటున్నారు.



మిర్చి ధరలిలా..

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 87,334 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 84,985 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. మంగళవారం అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 56,872 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

చిరునవ్వులు చెలరేగు

ఆశాజనకంగా రేగు సాగు

- ప్రత్తిపాడు నాటు కాయలకు గిరాకీ
- ఎకరాకు రెండు వేల మానికలకుపైగా దిగుబడి
- మానిక రేగు పళ్లు రూ.70 నుంచి రూ. 200పైమాటే
- ఉద్యాన పంటకు ప్రభుత్వ ప్రోత్సాహం నాస్తి



ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో సాగు చేస్తున్న రేగు పండ్ల తోటలు

ప్రత్తిపాడు: ధర లేక పత్తి పంట తెల్లబోతోంది. ఆశించిన స్థాయి దిగుబడి లేక మిర్చి ఘాటు తగ్గింది. వరిని తెగుళ్ళు వెక్కిరిస్తున్నాయి. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసే ప్రధాన పంటలు తెగుళ్లు, పురుగుల బారిన పడి పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో రైతులు నేల వైపు బేల చూపులు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రేగు సాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. నష్టాల మాట లేకుండా రైతుకు కాసులు కురిపిస్తోంది. ధర కూడా బాగుండటం రైతులకు కలిసొస్తోంది. రేగు పంటకు ప్రత్తిపాడు మండలం ప్రసిద్ధి. రావిపాటివారిపాలెం, చినకోండ్రుపాడు, నడింపాలెం గ్రామాల్లో పలువురు రైతులు సుమారు డెబ్బై ఎకరాల్లో నాటు రకం రేగు తోటలను సాగు చేస్తున్నారు. ఏటా నవంబరులో పూత మొదలై డిసెంబరులో కాపు వస్తుంది. జనవరి, ఫిబ్రవరి వరకు రేగు దిగుబడులు విస్తారంగా వస్తాయి. ఈ ఏడాది వరుసగా రెండు తుఫాన్‌లు రావడంతో పూత, పిందె రాలి దిగుబడులు కొంత తగ్గినా పరిస్థితి మెరుగ్గానే ఉంది.

పెరుగుతున్న రేగు సాగు

దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, ధర కూడా లాభాల బాటలో ఉండటంతో రైతులు రేగు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఆరేడేళ్ల కిందట వరకు పాతిక, 30 ఎకరాల్లో మాత్రమే ఉన్న రేగు సాగు ఈ ఏడాది సుమారు 70 ఎకరాలకు పెరిగింది. డబ్బులు కళ్లపడడంతో ఈ సాగుపై రైతులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు.

ఎకరాకు రెండు వేల నుంచి మూడు వేల మానికలు..

రేగు పండ్ల దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఎకరాకు రెండు వేల నుంచి మూడు వేల మానికల వరకు దిగుబడి వస్తోంది. వాతావరణం అనుకూలిస్తే నాలుగు వేల మానికల పైన కూడా దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఒక్కో మానిక ధర రిటైల్‌గా రూ.200 వరకు ధర పలుకుతుంది. హోల్‌సేల్‌గా వ్యాపారులకైతే రూ.70 నుంచి రూ.100 వరకు విక్రయిస్తారు. అంటే సగటున ఎకరాకు లక్షన్నర నుంచి రూ.మూడు లక్షల వరకు రాబడి వస్తుందన్న మాట. ఇందులో ఖర్చులు, పెట్టుబడులు, కౌలుకు రూ.లక్ష పైనే ఖర్చు అవుతుంది. దీంతో పంట కాలం రెండు, మూడు నెలల సమయంలో ఖర్చులన్నీ పోను సుమారు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. సీజన్‌లో సగటున రోజుకు క్వింటాకు పైగా దిగుబడి వస్తుంది.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే..

రేగు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే పండ్లను ఇతర ప్రాంతాలకు ఎక్స్‌పోర్ట్ చేసే అవకాశం ఉంటుంది. పచ్చి రేగుపండ్ల స్టోరేజీ సౌకర్యం లేకపోవడంతో రైతులు మార్కెటింగ్‌కు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యానశాఖ రాయితీలూ అందడం లేదు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడితే పక్క రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేసుకుంటామని రైతులు చెబుతున్నారు.



రేగు పండ్లు విక్రయిస్తున్న దృశ్యం

ఈ తీపి నాటు కాయ సాగు ప్రత్యేకం..

ప్రత్తిపాడు మండలంలో సాగులో ఉన్న రేగు పండ్ల తోటలన్నీ నాటు రకమే. నాటు రకాల్లో తీపి, పులుపు ఉన్నా, ఈ ప్రాంతంలో సాగులో ఉన్నది మాత్రం తీపి కాయలే. జిల్లా మొత్తమ్మీద తీపి నాటు కాయను పండించేది ఇక్కడే అంటే అతిశయోక్తి కాదు. కొండలకు సమీపంలో ఉండటంతో ఈ భూములు రేగు పంటకు కలిసొస్తున్నాయి. కాయలు రుచికరంగా ఉంటున్నాయి. దీంతో వ్యాపారులు కూడా ఇక్కడి నుంచే రేగు పండ్లను క్వింటాళ్లు, పెద్ద మానికల లెక్కన కొనుగోలు చేసుకుని తీసుకెళ్లి గిద్దలు, చిన్నమానికల లెక్కన గ్రామాల్లో విక్రయించుకుంటుంటారు. సాధారణ జనమైతే అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశవిదేశాల్లో ఉంటున్న బంధువులకు, హైదరాబాద్, బెంగళూరు, కర్ణాటకల్లో ఉంటున్న వారికి ఇక్కడి నుంచి ప్రత్యేకంగా గ్రేడింగ్ చేసిన కాయలను ప్యాకింగ్ చేసి పంపిస్తుంటారు. తోటల యజమానులతో పరిచయస్తులైతే ఏటా ఒకే తీపి చెట్టును ఎంచుకుని ఆ చెట్టు కాయలను తెల్లవారుజామున కోయించుకుని మరీ బంధుమిత్రులకు పంపుతుంటారు. ఆ చెట్లకున్న పచ్చి కాయలూ పంచదారలా ఉండడం విశేషం.



చెట్టుకు విరగకాసిన రేగు పండ్లు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **3,800**

మోడల్ ధర రూ. **3,400**

క్లుప్తంగా

గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయింపు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాలో 13, పల్నాడు జిల్లాలో 13 షాపుల చొప్పున 26 షాపులను కేటాయించింది. వీరికి మద్యం దుకాణాలు కేటాయింపునకు సంబంధించి ఎక్కడెక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలో పూర్తి వివరాలతో గెజిట్ త్వరలో విడుదల కానుంది. దాని ప్రకారం టెండర్లు నిర్వహించి ఎక్సైజ్ అధికారులు షాపులు కేటాయిస్తారు.

బీజేపీ జిల్లా అధ్యక్షునిగా చెరుకూరి తిరుపతిరావు



గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన చెరుకూరి తిరుపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని బీజేపీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, ఎన్నికల పరిశీలకులు కుమారస్వామి మంగళవారం ప్రకటించారు. గుంటూరు లాల్‌పురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు.

బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా శశికుమార్



శశికుమార్

నరసరావుపేట: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పిడుగురాళ్లకు చెందిన యేలూరి శశికుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం సత్తెనపల్లిరోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జిల్లా పరిశీలకుడు జూపూడి రంగరాజు సమక్షంలో ఎన్నికల కన్వీనర్ పులి కృష్ణారెడ్డి ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. శశికుమార్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనియర్ నాయకుడు. రెండేళ్లుగా పల్నాడు జిల్లాకు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

ఐదుగురు విశిష్ట మహిళలకు సత్కారాలు



విశిష్ట మహిళా మూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం(గుంటూరు ఈస్ట్): స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై పలు రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విశిష్ట మహిళా మూర్తులకు మంగళవారం సత్కారం జరిగింది. గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో పెద్ద సాంబశివరావు సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. గుంటుపల్లి అరుణజ్యోతి, సత్కారగ్రహీతలు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుందుర్తి స్వరాజ్య పద్మజ అధ్యక్షత వహించారు. 70 వసంతాల వయస్సుపైబడి పలు రంగాల్లో నిష్ణాతులైన దేవాలయ పాలక మండలి గౌరవాధ్యక్షురాలు ఆధ్యాత్మిక సేవా శిరోమణి గద్దె రామతులశమ్మ (ఆధ్యాత్మిక), వేమూరి రామలక్ష్మి (సంగీతం), డాక్టర్ సి.హెచ్. సుశీలమ్మ (సాహిత్యం), వి.ఎస్.డి.శ్యామసుందరీ దేవి (విద్యా), మాధవపెద్ది మీనాక్షి (సంగీతం)లను సత్కరించారు. ఆధ్యాత్మిక సేవాశిరోమణి, ధార్మిక సేవారత్న గద్దె రామతులశమ్మ జీవనయానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి, గుళ్ళపల్లి స్వాతి, అర్ధలపూడి నేహ, గుళ్ళపల్లి రాఘవరావు పాల్గొన్నారు. అనంతరం శ్రీసాయిమంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి నాట్యాచార్య డాక్టర్ కాజ వేంకటసుబ్రహ్మణ్యం శిష్య బృందం స్వాగతాంజలి నృత్యం ప్రదర్శించింది.

అక్రమ నిర్మాణంపై దేవదాయ అధికారుల తనిఖీ



భవనాన్ని పరిశీలిస్తున్న దేవాదాయశాఖ సహాయ కమిషనరు జి.మాధవి అధికారులు

కొల్లిపర: కొల్లిపరలో అనుమతుల్లేకుండా జరుగుతున్న భవన నిర్మాణాన్ని దేవదాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన బొంతు జగదీశ్వరరెడ్డి నిర్మిస్తున్న మూడంతస్తుల భవనం స్థలం శ్రీపోతురాజుస్వామి దేవాలయానికి చెందిందని, అక్కడ భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవంటూ కుంచెల వెంకటరామిరెడ్డి ఏపీసీఆర్‌డీఏ, తెనాలి జోనల్ కార్యాలయానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు దేవదాయశాఖ సహాయ కమిషనరు జి.మాధవి, తెనాలి దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదదేవి, ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి గ్రామానికి వచ్చారు. పంచాయతీ కార్యదర్శి అలకనంద, వీఆర్‌వో భాస్కర్‌తో కలిసి సంబంధిత ప్రదేశాన్ని, నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఇప్పటికే గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులు బొంతు జగదీశ్వరరెడ్డికి నోటీసులు ఇచ్చి భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయించినట్లు తెలుసుకున్నారు అనంతరం ఆలయ కమిటీ పెద్దలు, స్థానిక నివేశనదారులతో మాట్లాడారు. దేవాలయ రికార్డులను పరిశీలించారు. సంబంధిత భూమి అంతా గ్రామకంఠంలో ఉందని నిర్ధారించుకున్నారు. అనంతరం దేవాదాయశాఖ సహాయ కమిషనరు జి.మాధవి మాట్లాడుతూ కొల్లిపరలోని శ్రీపోతురాజుస్వామి గుడి దేవదాయశాఖ పరిధిలో లేదన్నారు. ఆలయానికి చెందిన స్థలంగా పేర్కొంటున్న గ్రామకంఠంలో దాదాపు 50 మంది గ్రామస్తులు నివాసగృహాలను నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్నారని వివరించారు. వీటికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. ఆలయ కమిటీ పెద్దలు, అక్కడ నివసిస్తున్న గ్రామస్తులు కలసి మాట్లాడుకుని పదిరోజుల్లో తగిన నిర్ణయం తీసుకుని నివేదించాలని సూచించారు. లేకుంటే నివాసాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల వెంట తూములూరు దేవాదాయశాఖ ఈవో ప్రసాద్, దేవాలయం కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



ఉదయ్‌కిరణ్ మృతదేహం

నరసరావుపేట రూరల్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కుందుర్తి గ్రామానికి చెందిన కనుపోలు ఉదయ్‌కిరణ్ (32) రెండు సంవత్సరాలుగా పట్టణంలోని 60 అడుగుల రోడ్డు సమీపంలో నివసిస్తున్నాడు. కార్ల క్రయవిక్రయ వ్యాపారం చేస్తున్నాడు. నష్టాలు రావడంతో మార్కెట్ సెంటర్‌లో కూరగాయల వ్యాపారం ప్రారంభించాడు. అప్పులు ఇచ్చిన వారి వేధింపులు ఎక్కువ కావడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య జయలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ కిశోర్ తెలిపాడు. అయితే ఉదయ్‌కిరణ్ ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల అప్పుల పాలైనట్లు ప్రచారం జరిగింది. ఇలా దాదాపు రూ.10 లక్షలు పోగొట్టుకున్నట్టు చెబుతున్నారు. కానీ ఈ ప్రచారాన్ని అతడి భార్య ఖండించారు.

జీజీహెచ్‌కు రూ.9 లక్షల విరాళం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఇంకుడు గుంతల అభివృద్ధి ద్వారా ఆసుపత్రిలో నీటి కొరతను నివారించేందుకు గుంటూరు వైద్య కళాశాల 1980 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు రూ. 9 లక్షలు విరాళం అందజేశారు. ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్‌కు పూర్వ వైద్య విద్యార్థులు రూ. 9 లక్షల చెక్కును అందజేశారు. ఈసందర్భంగా విరాళం అందజేసిన పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ సిద్దాబత్తుని నాగేశ్వరమ్మ, డాక్టర్ శారద, డాక్టర్ రామారావులను డెప్యూటీ సూపరింటెండెంట్ అభినందనించారు.

ఫార్మసిస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు కారార్యలయం పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పది గ్రేడ్–2 ఫార్మసిస్టు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ జి.సుచిత్ర తెలిపారు. సదరు నోఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేశామన్నారు. ఫైనల్ మెరిట్ లిస్టును, సెలక్షన్ లిస్టును సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఈనెల 27న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలన్నారు.

బిక్కుబిక్కుమంటున్న కేజీబీవీ విద్యార్థినులు

ప్రాంగణం వద్ద కొండచిలువ, పాముల సంచారంతో బెంబేలు

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ) చుట్టూ బయట వైపు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో కొండచిలువ, రెండు పాములు మంగళవారం సంచరించాయి. పాఠశాల ప్రహరీ సమీపంలో అవి కనిపించడంతో విద్యార్థినులు బెంబేలెత్తి బయటకు పరుగులు తీశారు. పరిసరాలు అధ్వానంగా ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా స్పందించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రహరీ నిర్మించాలని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగ పోటీలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్ తెలిపారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో జరిగిన కార్యక్రమంలో సైన్స్ ప్రయోగ పోటీల పోస్టర్లను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకతను పెంచేందుకు నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం - సుస్థిరాభివృద్ధి, మూఢ నమ్మకాలు - శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై 8,9,10 తరగతుల విద్యార్థులు ఐదు నిమిషాల నిడివి గల వీడియోను పంపాలని సూచించారు. వివరాలకు 90004 53600 నంబర్లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు జి.వెంకట్రావు, టీఆర్ రమేష్, డాక్టర్ ఏ. సత్యనారాయణ ప్రసాద్, ఎస్ఎం సుభానీ, యశ్వంత్, భారవి, వీవీకే సురేఖబ్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా వాసికి జాతీయ రంగస్థల పురస్కారం



బాపట్ల: బాపట్ల జిల్లా ఆదర్శనగర్‌కు చెందిన సంగాని ఏడుకొండలుకు జాతీయ రంగస్థల పురస్కారం దక్కింది. తెలుగు సంస్కృతి–సాహిత్య సేవా ట్రస్టు, ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాతీయ స్థాయి మొదటి వార్షికోత్సవం విజయవాడలో జరిగింది. వార్షికోత్సవంలో బాలచంద్రుడు ఏకపాత్రను ప్రదర్శించిన సంగాని ఏడుకొండలుకు స్వర్ణకంకణంతోపాటు జాతీయ రంగస్థల పురస్కారం లభించింది. 36ఏళ్లుగా పౌరాణిక, నాటకం ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన సంగానికి పురస్కారం రావటంపై పలువురు అభినందనలు తెలిపారు. మరోన్నె పురస్కారాలు సొంతం చేసుకోవాలని బాపట్ల నవ్యనాటక కళాసమితి అధ్యక్షులు సోమరాజు శ్రీను కోరుకున్నారు.

ఎక్సైజ్ చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు

నగరం: ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టాలకు అనుగుణంగా మద్యం షాపులు నడపాలన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ప్రజల వద్దకే మద్యం కథనంపైన ఆయన ఆరా తీశారు. సమావేశంలో సీఐ మారుతి శ్రీరామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో బెల్టు షాపుల నిర్వహణ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూడవ విడత చలానా వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ దివాకర్, సిబ్బంది ఉన్నారు.

బంగారు కమ్మలు అపహరించిన మహిళ

అద్దంకి రూరల్: జ్యూయలరీ షాపులో బంగారు కమ్మలు అపహరించిన మహిళను గుర్తించిన షాపు యజమాని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన సంఘటన మంగళవారం అద్దంకిలో చోటుచేసుకుంది. అద్దంకి పట్టణంలోని శ్రీరామ బజారులోని హనుమాన్ జ్యూయలరీ షాపులో గుర్తు తెలియని మహిళ వచ్చి కమ్మల మోడల్స్ చూపించమని అడగటంతో అవి ఉన్న బాక్స్‌ను ఆమెకు ఇచ్చారు. అయితే అందులోని రెండు బంగారు కమ్మలను తీసుకుని వాటి స్థానంలో నకిలీ కమ్మలు పెట్టి ఇచ్చింది. ఇవేమీ వద్దు అని చెప్పి వెళ్లిపోయింది. తరువాత యజమానికి అనుమానం వచ్చి కమ్మల బాక్స్ చూడటంతో అందులో ఒక జత నకిలీవిగా గుర్తించి ఆమెను వెతికిపట్టుకున్నారు. గట్టిగా అడగటంతో తీసుకున్న కమ్మలు ఇచ్చింది. దీంతో షాపు యజమాని ఆమెను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు.

24న డీ ఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాలపరిమితి గల డీ ఫార్మసీ కోర్సులో 2024–25 విద్యాసంవత్సరానికి కౌన్సెలింగ్ తరువాత మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాస్తి ఉషారాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ గ్రూపులు పూర్తి చేసిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలతో రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. ఇతర వివరాలకు 92471 20305, 98480 38769, 99593 24563 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉత్కంఠగా భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ



గుంటూరు జెయింట్స్‌కు ట్రోఫీ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తున్న భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ–20 క్రికెట్ టోర్నమెంట్ బీపీఎల్ 2024–25లో భాగంగా రెండో రోజైన మంగళవారం ప్రిలిమినరీ మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉదయం హైదరాబాద్ హాక్స్ జట్టు–3తో గుంటూరు జెయింట్స్–3 తలపడగా, గుంటూరు జెయింట్స్–3 జట్టు విజయం సాధించింది. అదే విధంగా మధ్యాహ్నం కృష్ణా నైట్స్, వైజాగ్ వెలాసిటీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ వెలాసిటీ జట్టు గెలుపొందింది. ఈసందర్భంగా విజేతలుగా నిలిచిన జట్లకు భాష్యం రామకృష్ణ ట్రోఫీలను బహూకరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు

లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: భూ యజమానులు రుణాలు తీసుకోకుండా ఉంటే గుర్తింపు కార్డులున్న కౌలు రైతులకు ఈ రబీలో పంట రుణాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో వ్యవసాయశాఖ, బ్యాంక్, రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ భూ యజమానులు కౌలు రైతులకు సహకారం అందిస్తే బ్యాంకు రుణాలు అధిక మొత్తంలో ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో 40,000 మంది గుర్తింపు కార్డులు పొందితే అందులో 12 వేల మంది భూ యజమానులు రుణాలు పొందకుండా ఉన్నారని చెప్పారు. ఎటువంటి ష్యూరిటీ లేకుండా భూమి లేని కౌలు రైతులకు గ్రూపుల ద్వారా రూ.రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ మాట్లాడుతూ కౌలు రైతులందరికీ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కౌలు రైతులు లీడ్ బ్యాంకు మేనేజర్‌కు తమ సమస్యలు విన్నవించారు. అనంతరం లీడ్ బ్యాంకు మేనేజర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అజయ్, ఏడీఏ శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు, సర్పంచ్ మబ్బు శిరీష, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.

ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేయాలి

ఏపీ ఎన్జీఓ మహిళా ఉద్యోగుల సమావేశం



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: గుంటూరులోని ఏపీ ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం ఏపీ ఎన్జీవో జిల్లా మహిళా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ రాధారాణి మాట్లాడుతూ మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో మహిళా ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వాటిని జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకు వెళతామన్నారు. కన్వీనర్ లక్ష్మీరమ్య మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు కార్యాలయంలో కనీస సదుపాయాలు లేవని చెప్పారు. కొన్ని కార్యాలయాలలో నేటికీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లు ఏర్పాటు చేయలేదని, వాటన్నిటి పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. నూతన సంవత్సర ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమెన్ వింగ్ గుంటూరు జిల్లా క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉమెన్ వింగ్ కన్వీనర్ ఎం.రాజ్యలక్ష్మి, రాష్ట్ర ఉమెన్ వింగ్ కన్వీనర్ పి.మాధవి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఉమెన్ కె.శివ జ్యోతి, గుంటూరు సిటీ అధ్యక్షుడు సూరి, సెక్రటరీ చింతల కళ్యాణ్ కుమార్, ప్రత్తిపాడు ప్రెసిడెంట్ అనిల్, జిల్లా ఉమెన్ వింగ్ కోశాధికారి శ్రీవాణి, కో చైర్ పర్సన్ అంజలి, కో-కన్వీనర్ శైలజ, సిటి ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ లక్ష్మీ ప్రసన్న, కన్వీనర్ విజయలక్ష్మి, జిల్లా, సిటీ ఉమెన్ వింగ్ కార్యవర్గ సభ్యులు, తాలూకా ఉమెన్ వింగ్ చైర్ పర్సన్, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిపై కత్తితో దాడిచేసిన అన్న అరెస్ట్

సాక్షి వార్తా కథనంతో స్పందించిన పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు

తాడేపల్లిరూరల్: ప్రకాష్‌నగర్‌లో తమ్ముడిపై కత్తితో అన్న దాడిచేసినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ సాక్షిలో వచ్చిన వార్తా కథనానికి తాడేపల్లి పోలీసులు స్పందించి నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్‌కు చెందిన ఆరిఫ్‌ను అతని అన్నయ్య అయిన షేక్ మీరా అలియాస్ ఆసిఫ్ పాత గొడవల నేపథ్యంలో డిసెంబర్ 12న కూరగాయలు కోసే కత్తితో పొడిచాడని వివరించారు. ఆరిఫ్‌ను బంధువులు 108 వాహనం ద్వారా విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారని, జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు వివరించారు.

కుప్పకూలిన లిఫ్ట్

ఐదుగురికి తీవ్రగాయాలు

తెనాలి: సామర్థ్యానికి మించి జనం ఎక్కడంతో అపార్టుమెంటు లిఫ్ట్ కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం వెనుకవైపు వీధిలో అయ్యప్పస్వామి గుడి వద్ద గ్రీన్‌లీఫ్ మినర్వా అపార్టుమెంటులో 32 వరకు ఫ్లాట్లు ఉన్నాయి. సమీపంలోని కఠెవరం గ్రామపంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఐదో ఫ్లోరులోని ఒక ఫ్లాటులో నివసిస్తున్న కుటుంబం సోమవారం రాత్రి పురోహితులను పిలిపించి, తమ ఇంట్లో రుద్రపారాయణం చేయించారు. పూజా కార్యక్రమాలన్నీ పూర్తయి, రాత్రి 10 గంటల ప్రాంతంలో పురోహితులు, వారి సహచరులు అంతా కలిసి కిందకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. మొత్తం 11 మంది లిఫ్ట్‌లో ఎక్కారు. ఐదు నుంచి నాలుగు, మూడో ఫ్లోరు వరకు బాగానే వచ్చిన లిఫ్ట్, అక్కణ్నుంచి ఒక్కసారిగా కుప్పకూలింది. కింద ఉండే స్ప్రింగులపై పడి పైకిలేచి మళ్లీ పడిపోయిందని అక్కడ నివసిస్తున్నవారు తెలిపారు. దీంతో లిఫ్టులోని వారంతా ఒకరిపై ఒకరు పడిపోయారు. అందులో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్ వాహనంలో వీరిని స్థానికంగా గల ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వాస్తవానికి లిఫ్ట్ సామర్థ్యం ఆరుగురేనని చెబుతున్నారు. దాదాపు రెట్టింపు జనాభా ఎక్కడంతో లిఫ్టుకుండే వైరు తెగి ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. దీనిపై బాధితులను వివరాల కోసం సంప్రదించగా, పత్రికలో రాయొద్దని కోరారు.

అక్రమంగా సాగుచేస్తున్న పంటలు ధ్వంసం

40 ఎకరాలను జేసీబీల సాయంతో దున్నేయించిన అధికారులు



శాఖమూరులో జేసీబీల సాయంతో పంటను దున్నేస్తున్న దృశ్యం

శాఖమూరు(తాడికొండ): సీఆర్డీఏ పరిధిలోని శాఖమూరు గ్రామంలో పూలింగ్‌కు ఇచ్చిన భూముల్లో అక్రమంగా రైతులు సాగుచేస్తున్న పంటలను అధికారులు ఎట్టకేలకు ధ్వంసం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి పత్రికల్లో కథనాలు రాయించి టీడీపీ నాయకులు కక్షతో పంటలను ధ్వంసం చేయించారు. ఈ ప్రాంతంలో పనుల్లేక పశువులను మేపుకుంటూ పశువుల మేతకోసం జొన్నసాగు చేసుకుంటున్న తమను ఇబ్బందులకు గురిచేయడంపై గ్రామస్తులు మాకుమ్మడిగా అధికారులను ప్రశ్నించారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు అక్రమంగా సాగుచేస్తున్న 40 ఎకరాల్లోని పంటలను మంగళవారం దున్నివేయించారు. మిగిలిన గ్రామాల్లో కూడా రైతులు పశుగ్రాసం కోసం పంటలు సాగు చేసుకుంటుండగా రాజధాని అభివృద్ధి పనులు పేరుతో అధికారులు వాటిని తీసేయాలని హుకుం జారీ చేస్తుండటంపై పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల విషయంలో పక్షపాతం వహించకుండా అందరికీ ఒకే న్యాయం జరిగేలా అధికారులు వ్యవహరించాలని కోరుతున్నారు.

యువతి ఆత్మహత్య

మాచర్ల: పట్టణంలోని పదో వార్డులో నివాసం ఉండే డిగ్రీ చదువుతున్న యువతి (20) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... నాలుగు నెలలుగా ఆమె కడుపు నొప్పితో బాధపడుతోందని, ఆ బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సమాచారం అందుకున్న సీఐ ప్రభాకరరావు, ఎస్సై సంధ్యారాణి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.